సాక్షి
జోగులాంబ గద్వాల
శనివారం । 31 । ఆగస్టు । 2024



హైవేపై అండర్‌పాస్‌లు
ఎన్‌హెచ్‌-44పై ప్రమాదాల నివారణే లక్ష్యంగా అండర్‌పాస్‌లు నిర్మిస్తున్నారు.

వివరాలు 8లో ▸



బిరబిరా కృష్ణమ్మ
జూరాలకు వరద పోటెత్తడంతో 45 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు.

వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
34.4 /22.9

వాతావరణం
అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఫిర్యాదులపై తక్షణం స్పందించాలి



గద్వాల క్రైం: సైబర్ కేసులు, ఫిర్యాదులపై సిబ్బంది తక్షణమే స్పందించి బాధితులకు అండగా ఉండాల్సిందిగా డీఎస్పీ సత్తయ్య అన్నారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కొందరు అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకొని తక్కువ వడ్డీకి రుణాలు అందజేస్తామని బురిడీ కొట్టించి, వారి ఖాతాల్లోంచి నగదు తస్కరిస్తున్నారని, ఇలాంటి ముఠాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సామాజిక మాధ్యమాలను సైబర్ నేరస్తులు మోసాలకు వేదికగా ఎంచుకున్నారని, బాధితుల కోసం సిబ్బంది సైబర్ వారియర్స్‌గా విధులు నిర్వహించాలన్నారు. మోసపోయిన వారు తక్షణమే 1930, ఎన్‌సీఆర్‌పీ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

వేరుశనగ క్వింటా రూ.6,129

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్‌యార్డుకు శుక్రవారం 1450 క్వింటాళ్ల వేరుశనగ రాగా, గరిష్ఠం రూ.6129, కనిష్ఠం రూ.1711, సరాసరి రూ.3469 ధరలు పలికాయి.

ఒప్పంద అధ్యాపకులకు పీఆర్సీ అమలుచేయాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: యూనివర్సిటీల్లో పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకులకు వెంటనే 7వ పీఆర్సీని అమలు చేయాలని పీయూ అధ్యాపక సంఘం నాయకులు అర్జున్‌కుమార్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం పీయూలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఆర్సీ అమలు కోసం ఉన్నత విద్యా మండలి అధ్యాపకుల వివరాలు సేకరించడం గొప్ప విషయం అని, పే స్కేల్‌ను అమలు చేసి, క్రమబద్ధీకరించాలన్నారు. ఈ ప్రక్రియ ఆలస్యమైతే భద్రతతో కూడా పే స్కేల్ అమలు చేయాలన్నారు. రాష్ట్రంలోని 11 యూనివర్సిటీల్లో 1,445 మంది అధ్యాపకులు పనిచేస్తున్నారని, ఇందుకోసం యూనివర్సిటీల్లో ఉన్న సంఘాలు ముందుకు రావాలని, రిజిస్ట్రార్‌లు వెంటనే డాటాను పంపించాలన్నారు. రవికుమార్, సుదర్శన్‌రెడ్డి, జిమ్మీకార్టన్, చంద్రశేఖర్, రాంమోహన్, చెన్నయ్య, సిద్ధరామయ్య పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: రాష్ట్రంలో విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని ఏఐఎస్‌ఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు ఇవ్వాల్సిన ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలపై ప్రభుత్వం వెంటనే నిర్లక్ష్యం వీడి వాటిని విడుదల చేయాలన్నారు. ట్రిబుల్‌ఐటీ ఏర్పాటు చేసేందుకు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. గురుకులాల్లో విద్యార్థుల మృతి బాధాకరమని, వాటిపై పూర్తిస్థాయిలో ప్రభుత్వం విచారణ జరపాలని, విద్యారంగంపై ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు.

ఉద్యాన రైతులకు ఊరట



గద్వాల శివారులో పందిళ్ల పద్ధతిన సాగు చేసిన బీరకాయ

విజ్ఞానయాత్రలకు, తీగజాతి పందిళ్ల ఏర్పాటుకు నిధులు మంజూరు

- మూడేళ్ల తర్వాత విడుదలతో రైతుల హర్షం
- యాత్రలతో ఇతర రాష్ట్రాల్లో సాగులో నూతన విధానాలు, పద్ధతులపై అవగాహన
- తీగజాతి కూరగాయల పందిళ్లకు 50శాతం సబ్సిడీతో మేలు

గద్వాల వ్యవసాయం: జిల్లాలో ఉద్యాన రైతులకు కాసింత ఊరట లభించింది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో క్షేత్రస్థాయిలో విజ్ఞానయాత్రలకు, నూతన పద్ధతులపై శిక్షణకు, అదేవిధంగా తీగజాతి కూరగాయల సాగులో భాగంగా ఏర్పాటు చేసుకునే పందిళ్లకు నిధులు మంజూరు అయ్యాయి. ఉద్యాన పంటలకు జిల్లాలో అనువైన పరిస్థితులు ఉన్నాయి. పండ్లతోటలు, కూరగాయల సాగుకు ఎర్రటి, ఒండ్రుతో కూడిన ఎర్రటి నేలలు ఉండాలి. నడిగడ్డలో ఇలాంటి నేలల శాతమే ఎక్కువగా ఉంది. సాగునీటి విషయానికి వస్తే జూరాల, ఆర్డీఎస్ ప్రాజెక్ట్‌లతో పాటు, నెట్టెంపాడు ఎత్తిపోతలు, రిజర్వాయర్లు, నోటిఫైడ్ చెరువులు, చెరువులు ఉన్నాయి. వీటన్నింటి ఫలితంగా బోర్లు, బావుల్లో ఆశించిన స్థాయిలో నీరు ఉంటోంది. ఇక వాతావరణం విషయానికి వస్తే వేసవిలో పగటి ఉష్ణోగ్రతలు ఎంత ఉన్నా.. సాయంత్రం నుంచి రాత్రి వరకు చల్లగా ఉంటుంది. శీతాకాలంలో ఎంత చలి ఉన్నా.. ఉష్ణోగ్రతలు పూర్తిగా పడిపోవు. ఇలా నేలలు, వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి.

ప్రయోజనం

విజ్ఞాన యాత్ర, శిక్షణతో పాటు పందిళ్ల ఏర్పాటు ఉద్యాన రైతులకు ప్రయోజనం కల్గిస్తుంది. ఉద్యాన పంటలు సాగు చేసే చాలా మంది రైతులు నూతన పద్ధతులు అవలంభించాలనుకున్నా తగిన విధానాలు తెలియక ఇబ్బందులు పడుతుంటారు. విజ్ఞానయాత్రల ద్వారా క్షేత్రస్థాయి సందర్శనలు చేసి నూతన పద్ధతులపై అవగాహన పెంచుకునే అవకాశం కల్గుతుంది. ఇక శిక్షణ వల్ల అధిక దిగుబడులు సాధించే విధానాలను తెలుసుకుంటారు. తీగజాతి కూరగాయలు పండించే రైతులు చాలా మంది ఆర్థిక కారణాల వల్ల పందిళ్లు ఏర్పాటు చేసుకోలేకపోతున్నారు. ప్రస్తుతం మంజూరైన నిధుల ద్వార కొంతమంది రైతులైనా లబ్ధిపొందడానికి అవకాశం ఏర్పడింది.

రైతులను ఎంపిక చేస్తాం



ఉద్యాన పంటలపై జిల్లా రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. విజ్ఞాన యాత్ర, శిక్షణ, పందిళ్ల ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయి. ఇందుకోసం ఆసక్తి గల రైతులను గుర్తిస్తాం. పందిళ్ల ఏర్పాటుకు నిబంధనల మేరకు రైతులను ఎంపిక చేసి, వారికి మంజూరు ఇస్తాం.

– ఎంఏ అక్బర్, జిల్లా ఉద్యానశాఖాధికారి

ఆర్‌కేవీవై ద్వారా మంజూరైన నిధుల వివరాలు

విజ్ఞానయాత్రకు (రాష్ట్రం వెలుపల 6 రోజులు)	
మంజూరైన నిధులు : రూ.1.20లక్షలు	రైతుల సంఖ్య : 20
ఒకరోజు శిక్షణకు (స్థానికంగా)	
రైతుల సంఖ్య : 50	మంజూరైన నిధులు : రూ.50వేలు
8 ఎకరాల్లో పందిళ్ల ఏర్పాటుకు	
రైతుల సంఖ్య: 16	మంజూరైన నిధులు : రూ.8లక్షలు

నిధులు మంజూరు

ఉద్యాన పంటలు సాగు చేసే విషయంలో యేటా నూతన పద్ధతులు వస్తున్నాయి. ఈక్రమంలో వేర్వేరు ప్రాంతాలు, ఇతర రాష్ట్రాల్లో ఉద్యాన పంటల సాగులో అవలంబిస్తున్న నూతన విధానాలను రైతులు విజ్ఞాన యాత్రల ద్వార క్షేత్రస్థాయి సందర్శనలతో తెలుసుకుంటేనే మంచి అవగాహన లభించి, వారు సైతం అలాంటి పద్ధతులు అనుసరించడానికి అవకాశం ఏర్పడుతుంది. దీంతోపాటు రైతులకు శిక్షణలు అవసరం. అయితే విజ్ఞానయాత్రలకు, శిక్షణలకు మూడేళ్ల నుంచి నిధులు మంజూరు కాలేదు. ఎట్టకేలకు ఈ ఆర్థిక సంవత్సరంలో ఇతర రాష్ట్రంలో ఆరు రోజుల పాటు విజ్ఞానయాత్ర చేసేందుకు, ఒక రోజు శిక్షణకు రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్‌కేవీవై) ద్వారా రూ.1.70లక్షలు నిధులు విడుదలయ్యాయి. ఇక కాకర, బీర, దోస తదితర తీగజాతి కూరగాయలను ప్రత్యేకంగా పందిళ్లు ఏర్పాటు చేసి పండించే నూతన పద్ధతి ఉంది. ఆర్‌కేవీవై ద్వారా అర ఎకరాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని 50 శాతం సబ్సిడీ అందించి ఈ పందిళ్ల ద్వారా సాగును ప్రోత్సహించారు. కాగా వీటికి సైతం మూడేళ్ల నుంచి నిధులు కేటాయించలేదు. ఈ ఏడాది ఆర్‌కేవీవై నుంచి వీటి ఏర్పాటుకు రూ.8లక్షలు నిధులు మంజూరయ్యాయి.

చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



కేటీదొడ్డిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ బీఎం సంతోష్

- అంగన్‌వాడీలలో నాణ్యమైన విద్యాబోధన చేయాలి
- కేజీబీవీ భవనాన్ని త్వరగా పూర్తి చేయాలి
- కలెక్టర్ బీఎం సంతోష్

కేటీదొడ్డి: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చి నాణ్యమైన విద్యాబోధన చేయాలని, కనీసం వారు వర్ణమాల అర్థం చేసుకొని పలకగలిగే స్థాయికి చేరుకునేలా చూడాలని కలెక్టర్ బీఎం సంతోష్ సూచించారు. శుక్రవారం కేటీదొడ్డి మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈక్రమంలో పలువురు చిన్నారులను బోర్డుపై అక్షరాలు రాసి చూపించగా వారు గుర్తు పట్టలేకపోవడంతో టీచర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నారులకు అక్షరాలను రాయడం, పలకడం కూడా నేర్పించకపోతే ఎలా అని అన్నారు. నెల రోజుల తర్వాత మళ్లీ వస్తానని, మార్పు రావాలని ఆదేశించారు. అనంతరం ఆర్థికాభివృద్ధి మహిళా శక్తి యూనిట్లలో కిరాణం, కుట్టుమిషన్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.

పాఠశాల నిర్మాణ పనులు వేగవంతం

అంతకుముందు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల పనులను కలెక్టర్ పరిశీలించారు. పనులు వేగవంతం చేసి త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కేజీబీవీ పాఠశాలను, తరగతి గదులు, డార్మెటరీలు, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. పెండింగులో ఉన్న పనులను ముఖ్యంగా నీటి సరఫరా, విద్యుత్ తదితర పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. తరగతి గదులలో వెంటిలేషన్ సరిగా ఉండేలా చూడాలన్నారు. సెప్టెంబర్ 5 లోగా పాఠశాలను ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం కేజీబీవీ సమీపంలో ఉన్న రెసిడెన్సియల్ స్కూల్ స్థలం వివరాలు సర్వేయర్, డిప్యూటీ తహసీల్దార్ శివశంకర్‌ను అడిగి తెలుసుకున్నారు. రెసిడెన్సియల్ స్కూల్ ప్రదేశంలో రాళ్ల పాతి ఎలాంటి అక్రమణలు జరగకుండా చూడాలన్నారు. అలాగే, సబ్ సెంటర్‌ను పరిశీలించి పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ స్థలం ఎన్ని ఎకరాలు, బడ్జెట్ ఎంత వచ్చిందని ఆరా తీసి టెండర్లు త్వరగా పిలిచి పనులు ప్రారంభించాలన్నారు. అనంతరం పాఠశాలను సందర్శించి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి, డీఎంహెచ్‌ఓ సిద్ధప్ప, డిటీ శివశంకర్, ఎంపీడీఓ కృష్ణమోహన్ మిషన్ భగీరథ ఈఈ శ్రీదర్ రెడ్డి, ఆర్‌ఐ ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనాలు త్వరగా పూర్తి చేయాలి

గద్వాల: అంగన్‌వాడీ భవన నిర్మాణాలను సెప్టెంబర్ 10వ తేదీలోగా పూర్తి చేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడీవోసీ కాన్ఫరెన్స్ హాలులో అంగన్‌వాడీ భవనాల పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో విద్యుత్ వ్యవస్థ సక్రమంగా లేదని, పెయింటింగ్, తాగు నీటి సరఫరా, టాయి లెట్స్ సదుపాయాలు కల్పించాలన్నారు. అలాగే, కేంద్రాల్లో అభ్యసించే చిన్నారులకు కనీసం ఆంగ్ల వర్ణమాల రాకపోవడం దారుణమని, సూపర్‌వైజర్లు అంగన్‌వాడీ కేంద్రాలను విధిగా తనిఖీ చేసి ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగ్‌రా వు, శిశుసంక్షేమశాఖ జిల్లా అధికారి సుధారాణి, మిషన్‌భగీరథ ఈఈ శ్రీధర్‌రెడ్డి, ఏఈ బషీర్ పాల్గొన్నారు.

బీజేపీని మరింత బలోపేతం చేయాలి



ధరూరులో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి

ధరూరు: బీజేపీ పార్టీ జాతీయ నాయకత్వ ఆదేశాల మేరకు రానున్న రోజుల్లో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతి బూతులో నిర్వహించాలని, పార్టీని గ్రామస్థాయిలోను మరింత బలోపేతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి అన్నారు. బీజేపీ సభ్యత్వ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు రాజేష్ అధ్యక్షతన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. బీజేపీ మాత్రమే దేశం కోసం, ధర్మం కోసం పని చేస్తుందని అన్నారు. సెప్టెంబర్ 2న ప్రధాని నరేంద్ర మోడీ మొదటి సభ్యత్వం తీసుకుంటారని, 3వ రాష్ట్ర పార్టీ కార్యాలయం, 4, 5వ తేదీల్లో జిల్లా కేంద్రాల్లో, 6వ తేదీన అన్ని మండల కేంద్రాల్లో సభ్యత్వ కార్యక్రమం ప్రారంభం అవుతుందని తెలిపారు. ప్రతి పోలింగ్ బూత్‌లో 200లకు తగ్గకుండా సభ్యత్వాలు చేయాలని కోరారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలను గెలిపించుకోవాలని కార్యకర్తలకు సూచించారు.కార్యక్రమంలో కిష్టన్న, ప్రతాప్‌రెడ్డి, వేమారెడ్డి, శేఖర్‌రెడ్డి, నర్సింహులు, రాజశేఖర్, శ్రీను, గజేంద్ర, లక్ష్మన్న, సురేష్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గణేష్ మండపాలకు అనుమతి తప్పనిసరి

గద్వాల క్రైం: వచ్చే నెల 7వ తేదీన వినాయక చవితి సందర్భంగా జిల్లాలోని వినాయక మండపాలను ఏర్పాటు చేసే నిర్వాహకులు పోలీసుశాఖ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సిందిగా ఎస్పీ శ్రీనివాస రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్వాహకులు తెలంగాణ పోలీసుశాఖ వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలను నమోదు చేసి సంబంధిత పోలీసు స్టేషన్‌లలో అందజేయాలని తెలిపారు. మండపాల వద్ద మద్యం తాగడం, అసభ్యకరమైన నృత్యాలు, ఇతర మతాలకు చెందిన వారిని కించపరచడం, ప్రసంగాలు చేయరాదని తెలిపారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు రాత్రి 10గంటల వరకు మాత్రమే సౌండ్ బాక్స్‌లను వాడాలని సూచించారు.

కుటుంబ నిర్ధారణ సర్వే వేగవంతం



వివరాలు తెలుసుకుంటున్న డీఏఓ గోవిందునాయక్

గద్వాలన్యూటౌన్: రుణమాఫీ ప్రక్రియలో భాగంగా కుటుంబ నిర్ధారణ సర్వేను వేగవంతం చేయాలని డీఏఓ గోవిందునాయక్ ఏఈఓలను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని కాకులారంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుటుంబ నిర్ధారణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణమాఫీ జాబితాలో పేరు ఉండి రేషన్‌కార్డు లేని వారి కుటుంబసభ్యుల వివరాలను కుటుంబ నిర్ధారణ పేరుతో సేకరిస్తున్నామని వివరించారు. ఆ వివరాలను మరోసారి పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రతాప్‌కుమార్, ఏఈఓలు రవికుమార్, ప్రవళిక, కీర్తి, హింధూజ ఉన్నారు.

ఓటరు జాబితాలో పొరపాట్లకు తావివ్వొద్దు



రాజోళిలో డ్రైయినేజీలను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ కాంతమ్మ

రాజోళి: రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఓటరు జాబితా పకడ్బందీగా తయారు చేయాలని జెడ్పీ సీఈఓ కాంతమ్మ సూచించారు. శుక్రవారం రాజోళి, ముండ్లదిన్నె గ్రామాల్లో ఆమె పర్యటించారు. డీపీఓ శ్యాంసుందర్‌తో కలిసి రాజోళి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని పరిశీలించారు. ఓటరు జాబితా తయారీలో ఎలాంటి తప్పులకు అవకాశం లేకుండా చూసుకోవాలన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది నిర్వహిస్తున్న రెండు ఓటర్ల గుర్తింపు తదితర వాటిని జెడ్పీ సీఈఓ పరిశీలించారు. అనంతరం 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా నిర్మించిన డ్రైనేజీలను పరిశీలించారు. అంతకు ముందు ముండ్లదిన్నెలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి వసతులు, గర్భిణులు, శిశువులకు అందుతున్న పథకాల గురుంచి ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఖాజా మెయినుద్దీన్,అశోక్ కుమార్, ఆయా గ్రామాల పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

నిధుల్లేక.. నిలిచిన పనులు

- ఏళ్లుగా అసంపూర్తిగా 30 పడకల ఆస్పత్రి భవనం
- రూ.1.10 కోట్లు మంజూరు.. రూ.80 లక్షలకు టెండర్
- శంకుస్థాపన చేసి మూడేళ్లయినా పూర్తి కాని వైనం
- రూ.50లక్షలు మంజూరైతేనే భవనం పూర్తి



అయిజలో అసంపూర్తిగా 30 పడకల ఆస్పత్రి భవనం

అయిజ: మున్సిపాలిటీ కేంద్రమైన అయిజలో 30 పడకల ఆస్పత్రి భవన నిర్మాణం నిధుల్లేక ఏళ్లుగా అసంపూర్తిగా నిలిచిపోయింది. అయిజ పీహెచ్‌సీకి ప్రతి రోజు 250కు పైగా అవుట్ పేషెంట్లు, 10 మందికి పైగా ఇన్ పేషెంట్లు వస్తుంటారు. గతంలో ఉన్న పీహెచ్‌సీ భవనం శిథిలావస్థకు చేరి పైకప్పు పెచ్చులూడి పడుతుండడం, మౌళిక వసతులు లేకపోవడంతో గత పాలకులు ఈ పీహెచ్‌సీ పక్కనే 30 పడకల ఆస్పత్రి నిర్మించాలని నిర్ణయించారు.

2021లో శంకుస్థాపన

ఈ పీహెచ్‌సీకి మల్దకల్, గట్టు, వడ్డెపల్లి మండలాల ప్రజలు కూడా వస్తుండడంతో పీహెచ్‌సీ భవనం ఏమాత్రం సరిపోవడంలేదు. దీంతో పీహెచ్‌సీ పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో 30 పడకల మాతా శిశు సంరక్షణ కేంద్ర భవనం నిర్మించేందుకు అధికారులు శ్రీకారం చుట్టారు. దానికోసం 2017లో అప్పటి ప్రభుత్వం రూ. 1.10 కోట్లు నిధులు మంజూరు చేసింది. 2018లో కరోనా విపత్తు సమయంలో అత్యవసర పనులకు కలెక్టర్ రూ.30 లక్షల నిధులను ఖర్చు చేశారు. మిగిలిన రూ.80 లక్షలకు మాత్రమే టెండర్ ప్రక్రియ నిర్వహించారు. అధికారులు చేపట్టిన 30 పడకల ఆస్పత్రిలో వైద్యుల గది, స్టాఫ్ నర్స్ గది, 12 పడకలతో కూడిన రెండు గదులు, ఆరు పడకలతో కూడిన ఒక గది నిర్మించాలి. ఈమేరకు 30 పడకల ఆస్పత్రి (మాతా శిశు సంరక్షణ కేంద్రం) నిర్మాణం చేపట్టేందుకు 2021 సెప్టెంబర్ 30వ తేదీన అప్పటి అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహాం శంకుస్థాపన చేశారు. అయితే శిలాఫలకంపై అంచనా నిధులు రాయలేదు. శంకుస్థాపన జరిగి మూడేళ్లు అవుతున్నా ఇప్పటి వరకు భవన నిర్మాణం పూర్తికాలేదు. ఇంకా భవనానికి రంగులు వేయాల్సి ఉంది. అదేవిధంగా విద్యుత్, తలుపుల ఏర్పాటు తదితర పనులు పూర్తిచేయాల్సి ఉంది.



శిథిలావస్థకు చేరిన పాత పీహెచ్‌సీ భవనం

నివేదిక పంపించాం



అయిజలోని పీహెచ్‌సీ పక్కన 30 పడకల ఆస్పత్రి నిర్మించేందుకు రూ.1.10 నిధులు మంజూరైతే రూ.30 లక్షలు వేరే పనులకు మళ్లించారు. కేవలం రూ. 80 లక్షలకు టెండర్ నిర్వహించాం. విడుదలైన నిధుల మేర పనులు పూర్తిచేశాం. అంచనా వ్యయం పెరగడంతో మరో రూ. 50 లక్షల నిధులు అవసరమవుతాయి. దీనికోసం అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం.

– జైపాల్‌రెడ్డి, టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ ఈఈ

పెరిగిన అంచనా వ్యయం

మాతా శిశు సంరక్షణ కేంద్రం భవనం నిర్మించేందుకు మరో రూ. 50 లక్షల నిధులు అవసరమవుతాయని, అవి మంజూరైతేనే నిర్మాణ పనులు పూర్తవుతాయని ఇంజినీర్ అధికారులు ఒక నిర్ధారణకు వచ్చారు. దీనికోసం అంచనా కాపీని తయారుచేశారు. ఆ నిధులు మంజూరైతేనే భవనం పూర్తి కానుంది.

క్లుప్తంగా

వాగులో కొట్టుకుపోయి వృద్ధురాలు మృతి

పాన్‌గల్: వాగు దాటుతుండగా కొట్టుకుపోయి మహిళ మృతిచెందిన సంఘటన శుక్రవారం మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిక్కేపల్లికి చెందిన అలివేలమ్మ(65) తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్లేందుకు గ్రామ సమీపంలోని వాగును దాటుతుండగా.. నీటి ఉధృతికి వాగులో కొట్టుకుపోయింది. వాగు పరిసరాల్లో పొలం పనులు చేస్తున్న వారు గమనించి తాడు సాయంతో పట్టుకున్నారు. అప్పటికే వృద్ధురాలు మృతిచెందింది. మృతురాలికి కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పొలం దగ్గరికి వెళ్లి వస్తానన్న వృద్ధురాలు మృత్యువాత పడటంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శ్రీనివాసులు తెలియజేశారు.

వాగులో పడి మరొకరు..

చిన్నచింతకుంట: మతి స్థిమితం కోల్పోయిన ఓ వృద్ధురాలు ఊకచెట్టు వాగులో పడి మృతిచెందిన ఘటన మండలంలోని బండ్రపల్లి సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, గ్రామస్తుల కథనం మేరకు.. దేవరకద్ర మండలం గూరకొండకు చెందిన ఓరుగంటి కొండమ్మ (60) మతి స్థిమితం కోల్పోయి తిరుగుతుండేదని.. ఇదే క్రమంలో చిన్నచింతకుంట మండలం బండ్రపల్లి సమీపంలోని ఊకచెట్టువాగులో పడి మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

జూరాల కాల్వలో వ్యక్తి గల్లంతు

వనపర్తి రూరల్: పెబ్బేరు మండలం తోమాలపల్లి గ్రామ శివారులోని జూరాల ప్రధాన కాల్వలో ప్రమాదవశాత్తు జారిపడి ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి కథనం ప్రకారం.. ఏపీలోని కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన సోమశంకర్ హైదరాబాద్‌లో ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన తన స్నేహితుడు జాదవ్ అంకిత్ కుమార్‌తో కలిసి బైక్‌పై వాకర్ తీసుకొని స్వగ్రామం ఆదోనికి బయలుదేరారు. మార్గమధ్యలో పెబ్బేరు మండలం తోమాలపల్లి శివారులోని జూరాల కాల్వ దగ్గర ఆగగా.. జాదవ్ అంకిత్ కుమార్ కాళ్లు, ముఖం కడుక్కోవడానికి కాల్వలోకి దిగగా ప్రమాదవశాత్తు అందులోపడి నీటి ఉధృతికి కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. ఈ ఘటనపై సోమశంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

కోడేరు: ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన రాజాపూర్ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రేకులపాడు ఆంజనేయులు(40)కు 3 ఎకరాల 20 గుంటల భూమి ఉండేది. కాగా అందులో రెండు ఎకరాలు అతడి సోదరులు పెద్దరాములు, చిన్నరాములు పేరు మీద పొరపాటుగా రిజిస్టర్ అయింది. కాగా తన భూమి తనకు రిజిస్ట్రేషన్ చేయాలని ఎంత అడిగినా సోదరులు రేపూ.. మాపూ అంటూ జాప్యం చేస్తున్నారు. దీంతో మనస్తాపానికి గురైన ఆంజనేయులు ఇంట్లో ఎవరు లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడికి భార్య అరుణ, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. అతడి భార్య అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ ఖయ్యూం తెలిపారు.

డీజిల్ పోసుకుని మహిళ..

తెలకపల్లి: ఓ మహిళ ఒంటిపై డీజిల్ పోసుకుని.. నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ నరేష్ కథనం ప్రకారం.. కమ్మరెడ్డిపల్లికి చెందిన గంగారం శారద(35) కుటుంబ విషయంలో భర్త రాజుపై శుక్రవారం మధ్యాహ్నం గొడవపడింది. మనస్తాపానికి గురై ఒంటిపై డీజిల్ పోసుకుని నిప్పంటించుకుంది. కుటుంబ సభ్యులు నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు పరిశీలించి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తీసుకెళ్లాలని సూచించారు. అక్కడికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే కల్వాల్ సమీపంలో ఆమె మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. ఆమెకు ఒక కుమారుడు ఉన్నాడు. ఆమె తమ్ముడు మిద్దె వెంకటేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

పన్ను చెల్లించకపోతే చర్యలు తప్పవు

జడ్చర్ల: పన్నులు చెల్లించకుండా గ్రానైట్ తదితర వ్యవహారాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని వాణిజ్య పన్నుల శాఖ అధికారులు హెచ్చరించారు. వివరాల్లోకి వెళ్తే.. జడ్చర్ల–మహబూబ్‌నగర్ ప్రధాన రహదారిని అనుసరించి నిర్వహిస్తున్న ఓ దుకాణంలో.. పన్నులు చెల్లించకుండా ఇతర ప్రాంతాల నుంచి గ్రానైట్‌ను దిగుమతి చేసుకుంటున్నారన్న సమాచారం రావడంతో సంబంధిత వాణిజ్య పన్నుల శాఖ అధికారి హుటాహుటిన అక్కడకు వెళ్లారు. కాగా అప్పటికే హడావుడిగా గ్రానైట్‌ను అన్‌లోడ్ చేసిన వ్యాపారి.. లారీని కనిపించకుండా అతి వేగంగా ముందుకు పంపించేశాడు. అధికారి లారీని ఆపే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. కాగా గ్రానైట్ లారీ తమ దగ్గరకు రానేలేదని.. జీఎస్టీ కట్టిన తరువాతే తాము గ్రానైట్‌ను తీసుకువస్తామని సదరు వ్యాపారీ బుకాయించాడు. లారీ దొరకక పోవడంతో అధికారి వెనుదిరిగారు.



జూరాల ప్రాజెక్టు వద్ద 45 క్రస్టు గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న వరద నీరు



శ్రీశైలం నుంచి సాగర్‌వైపు పరుగులు పెడుతున్న కృష్ణమ్మ

బిరబిరా కృష్ణమ్మ

- జూరాలకు మళ్లీ పెరిగిన వరద
- 3.21 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో.. 45 గేట్ల నుంచి నీటి విడుదల
- పది గేట్లు ఎత్తి సాగర్‌కు నీటి విడుదల

ధరూరు/దోమలపెంట/ఆత్మకూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు వద్ద కృష్ణమ్మ పోటెత్తింది. శుక్రవారం రాత్రి 9 గంటలకు 3,21,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా..ప్రాజెక్టు 45 క్రస్టుగేట్లను ఎత్తి 3,08,610 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జెన్‌కో జలవిద్యుత్ కేంద్రంలో ఐదు యూనిట్లను కొనసాగించి విద్యుదుత్పత్తి చేస్తూ 19,009 అదనంగా వదిలేస్తున్నారు. ఆవిరిరూపంలో 89 క్యూసెక్కులు, కుడి కాల్వ ద్వారా 620 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 820 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 50 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 3,29,463 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 8.300 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువన ఉన్న ఆలమట్టి ప్రాజెక్టుకు 1,66,760 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 1,76,540 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టుకు 1,85,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 30 గేట్లను ఎత్తి 1,78,500 క్యూసెక్కుల వరద నీటిని జూరాలకు వదులుతున్నారు. మరోవైపు జూరాలలోని ఎగువ విద్యుత్ కేంద్రంలో ఐదు యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు, 123.186 ఎంయూ, దిగువలో ఇప్పటివరకు 99.710 ఎంయూ విద్యుదుత్పత్తిని చేపట్టామన్నారు. ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటివరకు 222.896 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని సాధించామని తెలిపారు. మరోవైపు శ్రీశైలం జలాశయానికి జూరాల నుంచి 3,29,203 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. ఆనకట్ట వద్ద పది గేట్లు ఒక్కొక్కటి పది అడుగుల మేరకు పైకెత్తి స్పిల్‌వే ద్వారా 2,79,370 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు. మరోవైపు భూగర్భకేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 37,882 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 30,772 మొత్తం 68,654 క్యూసెక్కుల నీటిని అదనంగా సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం 884.70 అడుగుల వద్ద 213.88 టీఎంసీల నీటి నిల్వ ఉంది. గడిచిన 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 30,000 క్యూసెక్కులు, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 2,400, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,505 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 16.710 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేశారు. కుడిగట్టు కేంద్రంలో 15.532 మి.యూనిట్లు ఉత్పత్తి చేశారు.

హైవేపై అండర్‌పాస్‌లు



వేముల స్టేజీ వద్ద అండర్ పాస్ నిర్మించనున్న ప్రాంతం

- 44వ నంబర్ జాతీయ రహదారిపై ఐదు చోట్ల నిర్మాణానికి శ్రీకారం
- వేముల స్టేజీ వద్ద మొదలైన పనులు
- జానంపేట వద్ద స్థల మార్పు కోరుతున్న గ్రామస్తులు
- ఆరు వరుసలకు అనుగుణంగా పనులు



వేముల స్టేజీ వద్ద సర్వీస్ రోడ్డు నిర్మాణానికి చదును చేసిన దృశ్యం

అడ్డాకుల: ఎన్‌హెచ్–44పై ఎక్కువగా ప్రమాదాలు చోటుచేసుకునే ప్రాంతాల్లో అండర్ పాస్‌లు నిర్మించాలని జాతీయ రహదారుల సంస్థ నిర్ణయించింది. ఈ మేరకు బ్లాక్ స్పాట్ల వద్ద నిర్మాణ పనులను ఎట్టకేలకు ప్రారంభించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కొత్తూర్ నుంచి అలంపూర్ వరకు సుమారు 180 కి.మీ. మేర 44వ నంబర్ జాతీయ రహదారి విస్తరించి ఉంది. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల నుంచి వనపర్తి జిల్లా కొత్తకోట వరకు వెస్ట్రన్ ఆంధ్రా టోల్‌వేస్ పరిధిలో సుమారు 55 కి.మీ. రహదారి ఉండగా.. 14 బ్లాక్ స్పాట్లను ఎన్‌హెచ్ఏఐ అధికారులు గుర్తించారు. అందులో వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కనిమెట్ట, పెద్దమందడి మండలం వెల్టూర్ స్టేజీ, మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలంలోని వేముల స్టేజీ, జానంపేట, భూత్పూర్ మండలంలోని శేర్‌పల్లి(బీ) వద్ద అండర్ పాస్‌లను నిర్మించేందుకు టెండర్ల ప్రక్రియను పూర్తిచేశారు. ఈక్రమంలో వేముల స్టేజీ వద్ద పనులకు శ్రీకారం చుట్టారు. రెండు, మూడేళ్ల నుంచి అప్పుడూ.. ఇప్పుడు అంటున్న అండర్ పాస్ పనులకు ఎట్టకేలకు మోక్షం లభించింది.

జానంపేటలో మార్పు చేస్తారా?

జానంపేట వద్ద అండర్ పాస్ పనులు కొంత ఆలస్యమయ్యే అవకాశం ఉంది. అక్కడ రహదారుల సంస్థ 104.305 పాయింట్ వద్ద అండర్ పాస్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అయితే అండర్‌పాస్ నిర్మాణ స్థలాన్ని మార్చాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. అందులో భాగంగా ఇటీవల ఎన్‌హెచ్ఏఐ పీడీ హిమాన్షు గుప్తాను కలిసి 104.120 పాయింట్ వద్ద అండర్ బ్రిడ్జి నిర్మించే విధంగా మార్పు చేయాలని వినతిపత్రం అందజేశారు. తర్వాత ఆయన గ్రామానికి వచ్చి పరిశీలన చేశారు. అయితే స్థలం మార్పు విషయం తమ చేతుల్లో లేదని.. రహదారుల సంస్థ నిర్ణయిస్తుందని గ్రామస్తులకు తేల్చి చెప్పారు. తమ ప్రధాన కార్యాలయానికి స్థల మార్పు అంశం గురించి నివేదిస్తామని.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నడుచుకుంటామని పీడీ చెప్పినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. దీంతో ఇక్కడ పనులు మొదలుపెట్టడంపై కొంత ఊగిసలాట కొనసాగుతోంది. ఇదిలా ఉంటే, గ్రామస్తులు మాత్రం 104.120 పాయింట్ వద్ద అండర్ బ్రిడ్జి నిర్మాణం చేయాలని కోరుతున్నారు.

ఆరు వరుసలకు అనుగుణంగా

44వ నంబర్ జాతీయ రహదారిని హైదరాబాద్ నుంచి బెంగళూర్ వరకు 12 వరుసలుగా విస్తరిస్తారని ఇటీవల ప్రచారం జోరందుకుంది. ఇదిలా ఉంటే, ఇప్పుడు ఐదు అండర్ పాస్‌లను మాత్రం ఆరు వరుసల రహదారికి అనుగుణంగా నిర్మిస్తున్నారు. ఇప్పుడు రహదారుల సంస్థ ఆధీనంలో ఉన్న స్థలంలోనే అండర్ బ్రిడ్జిలను నిర్మించనున్నారు. ఒకవేళ రహదారిని 12 వరుసలుగా విస్తరించాలనుకుంటే మాత్రం భూసేకరణ చేయాల్సి వస్తుందని అధికారులు చెబుతున్నారు.

వేముల స్టేజీ వద్ద సర్వీస్ రోడ్డు పనులు..

వేముల స్టేజీ వద్ద మొదట సర్వీస్ రోడ్డు నిర్మాణానికి కొలతలు తీస్తున్నారు. ప్రస్తుతం ఉన్న రహదారి డివైడర్ నుంచి రెండు వైపులా 30 మీటర్ల వరకు మార్కింగ్ వేసి, సర్వీస్ రోడ్డు పనులను మొదలుపెట్టారు. ప్రస్తుతం సర్వీస్ రోడ్డు వేసే చోట ఉన్న చెట్లతో పాటు బస్‌షెల్టర్లను తొలగిస్తున్నారు. కాగా, ప్రస్తుతమున్న ప్రధాన రహదారిని వదిలి, దాని పక్కనే మొదట సర్వీస్ రోడ్డును వేయనున్నారు. సర్వీస్ రోడ్లను అందుబాటులోకి తెచ్చిన తర్వాత అండర్ పాస్ పనులు చేపట్టనున్నారు.

స్థలం మార్చాలి..



జానంపేటలో ఎన్‌హెచ్–44పై 104.305 పాయింట్ వద్ద అండర్ బ్రిడ్జి నిర్మాణంతో ఎలాంటి ఉపయోగం ఉండదు. స్థలాన్ని మార్చాలి. 104.120 పాయింట్ వద్ద నిర్మించాలని ఇటీవల అధికారులను కలిసి వినతిపత్రాన్ని అందజేశాం. అధికారులు మా సమస్యను పరిగణలోకి తీసుకుని 104.120 వద్ద బ్రిడ్జిని నిర్మించాలి.

– కృష్ణయ్య, మాజీ ఎంపీటీసీ, జానంపేట

ఇండియన్ బిజినెస్ స్కూల్‌తో ఎన్టీఆర్ కళాశాల ఒప్పందం



ఒప్పంద పత్రాలు చూపిస్తున్న ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిలాకేంద్రంలోని ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఇండియన్ బిజినెస్ స్కూల్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంస్థ డిప్యూటీ చీఫ్ మేనేజర్ సురేష్ మాట్లాడుతూ నేటి వ్యవస్థలో మనం వాడుతున్న ప్రతి వస్తువు కూడా కార్పొరేట్ కంపెనీలు తయారు చేసినవే అని, వాటిల్లో ఉద్యోగాలు రావాలంటే తప్పకుండా నైపుణ్యం ఉండాలన్నారు. ఉద్యోగాలు పొందేందుకు ఉన్న అవకాశాలపై ఆయన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. వివిధ అంశాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉంటే ఉద్యోగం సాధించడం సులువుగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, అధ్యాపకులు పద్మ, ముంతాజ్, అమీనాబేగం, శ్రీదేవి, ఉషాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అలంపూర్ ఎస్ఐపై లైంగిక ఆరోపణలు?

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ ఎస్ఐ నాగరాజు ఓ కానిస్టేబుల్ భార్యతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నారంటూ ఓ టీవీ చానల్‌లో వార్త ప్రసారం కావడం.. ఆ వీడియో కాస్త సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడంతో స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. అలంపూర్ ఎస్ఐ నాగరాజు తన భార్యతో సన్నిహితంగా ఉంటున్నారంటూ కర్నూలు జిల్లాలోని ఓ కానిస్టేబుల్ ఇటీవల ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై జిల్లా పోలీస్ యంత్రాంగం విచారణ చేపట్టింది. ఇంతలో శుక్రవారం వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడంతో సీఐ రవిబాబు స్పందించారు. కర్నూలు జిల్లాకు చెందిన కానిస్టేబుల్‌పై తెలంగాణలోని రెండు పోలీస్‌స్టేషన్లలో కేసు నమోదైందన్నారు. అతడి ఆరోపణలపై తాము విచారణ చేస్తున్నామంటూ వివరణ ఇచ్చారు. కాగా.. సదరు మహిళ సైతం మీడియా ముందుకొచ్చి తన భర్తే శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడని తెలిపింది. ఎస్ఐతో తనకు సంబంధం ఉందని చెప్పాలంటూ చిత్రహింసలకు గురి చేశాడని ఆరోపించారు. తనకు న్యాయం చేయాలంటూ మీడియా ముందు కన్నీరు పెట్టుకుంది. అలంపూర్ ఎస్ఐ నాగరాజును వివరణ కోరగా సదరు మహిళ తమ బంధువని చెప్పారు. భార్యాభర్తల మధ్య జరుగుతున్న గొడవల గురించి చెప్పగా.. పక్క రాష్ట్రం కావడంతో జోక్యం చేసుకోలేనని, డయల్ 100కు ఫిర్యాదు చేయాలని సలహా ఇచ్చానని తెలిపారు. కానిస్టేబుల్ భార్యకు సహకరిస్తున్నానని కోపం పెంచుకొని సదరు కానిస్టేబుల్ తన పరువుకు భంగం కలిగించేలా ప్రవర్తించారని వివరించారు. నిజానిజాలు తెలుసుకోకుండా ఆరోపణలు చేయడం సరికాదని తెలిపారు.

చోరీ కేసులో నిందితుడికి జైలు శిక్ష

వనపర్తి రూరల్: మండలంలోని కడుకుంట్లలో జరిగిన చోరీ కేసులో నిందితుడికి వనపర్తి జేపీసీ కోర్టు న్యాయమూర్తి జానకి శుక్రవారం 16నెలల జైలు శిక్ష, రూ.200 జరిమానా విధించినట్లు వనపర్తి రూరల్ ఎస్ఐ జలేందర్‌రెడ్డి తెలియజేశారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కడుకుంట్లలో 14-05-2023న గ్రామానికి చెందిన మండ్ల ఎల్లమ్మ ఇంటి ముందు నిద్రిస్తుంది. ఆ సమయంలో తన సంచిలోని రూ.2 వేలు అదే గ్రామానికి చెందిన పానుగంటి రాములు చోరీ చేశారని బాధితురాలు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్ఐ రామరాజు అతడిపై కేసు నమోదు చేసి చార్జిషీట్ కోర్టులో దాఖలు చేసి హాజరుపరిచారు. అప్పటి నుంచి వనపర్తి జేపీసీ కోర్టులో కేసు కొనసాగుతుంది. 9 మంది సాక్షులను అడిషినల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సునీత, కోర్టు కానిస్టేబుల్ ఖాదర్ న్యాయమూర్తి ఎదుట ప్రవేశపెట్టారు. వాదోపవాదములు విన్న న్యాయమూర్తి నేరస్తులకి 16 నెలల జైలుశిక్ష, రూ.200 జరిమానా విధించారు.

ఏడుగురికి జైలు శిక్ష

మానవపాడు: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ చంద్రకాంత్ తెలిపారు. శుక్రవారం అలంపూర్ కోర్టులో పలువురిని హాజరుపరిచారు. ఈమేరకు కోర్టు జడ్జి కవిత 7 మందికి జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.2వేలు చొప్పున జరిమానా విధించారు. అదేవిధంగా మరో నలుగురికి రూ. 2వేలు చొప్పున జరిమానా వేసినట్లు ఎస్ఐ వివరించారు.

పోక్సో కేసులో నిందితుడికి జీవిత ఖైదు

- లైంగిక దాడి చేసిన ఘటనలో కోర్టు తీర్పు

కందుకూరు: ప్రేమ పేరుతో ఓ బాలికను మభ్యపెట్టి లైంగికంగా దాడిచేసి, అనంతరం వివాహం చేసుకున్న ఘటనలో నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.25 వేల జరిమానా విధిస్తూ జిల్లా ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక కోర్టు తీర్పు ఇచ్చింది. ఈ మేరకు శుక్రవారం సీఐ సీతారాం విలేకరులకు వెల్లడించారు. వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కన్నాయిపల్లికి చెందిన ఇరగదిండ్ల శివాజీ(20) 2017 సంవత్సరంలో కందుకూరు మండలం వావిళ్లకుంటతండా సమీపంలోని పవర్‌గ్రిడ్ వద్ద కూలి పనులు చేయడానికి వచ్చాడు. కాగా మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఓ బాలిక(16) కుటుంబం కూడా అదే ప్రాంతంలో కూలి పనులు చేసుకుంటుంది. శివాజీ 2017 ఫిబ్రవరి 11న రాత్రి సమయంలో ఆ బాలికను ప్రేమ పేరుతో మభ్య పెట్టి సికింద్రాబాద్‌కు తీసుకెళ్లి లైంగిక దాడి చేశాడు. అనంతరం ఓ దేవాలయంలో వివాహం చేసుకున్నాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అప్పట్లో అతడిపై కందుకూరు పోలీసులు ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక, పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు. సుదీర్ఘంగా విచారించిన ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి శివాజీని దోషిగా నిర్ధారిస్తూ జీవిత ఖైదుతో పాటు రూ.25 వేల జరిమానా విధించారు. బాధితురాలికి నష్ట పరిహారం కింద రూ.5 లక్షలు ప్రభుత్వం అందించాలని తీర్పులో ఆదేశించారు.



చెరువు కాదు.. భవిత కేంద్రం పైకప్పు

అది జడ్చర్లలో ప్రత్యేక అవసరాల చిన్నారుల కోసం నిర్మించిన భవిత కేంద్ర భవనం. ఇందులో 20 మంది వరకు మానసిక రుగ్మతలు గల చిన్నారులు శిక్షణ పొందుతుంటారు. వర్షపు నీరు భవనం పైకప్పుపై నిలిచి చెరువును తలపిస్తోంది. రోజుల తరబడి నీరు ఇలాగే నిల్వడంతో భవనం కూలే ప్రమాదం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

– జడ్చర్ల

అనుమతి లేని క్లినిక్ సీజ్



పాలమూరు: ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా నిర్వహిస్తున్న క్లినిక్‌ను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు సీజ్ చేశారు. పట్టణంలోని హబీబ్‌నగర్‌లో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న క్లినిక్‌పై వచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి పద్మ, జిల్లా మాస్ మీడియా అధికారి మంజులతోపాటు వన్‌టౌన్ సీఐ అప్పయ్య సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఓ ఇంట్లో సాధిక్ అనే వ్యక్తి రెండు పడకలు ఏర్పాటు చేసి, పరిశుభ్రత లేకపోవడంతోపాటు గాలి వెలుతురు లేకుండా వైద్యం చేస్తున్నట్లు గుర్తించారు. దీంతో క్లినిక్‌ను సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ పద్మ మాట్లాడుతూ అనుమతి లేకుండా అక్రమంగా క్లినిక్‌లు ఏర్పాటు చేసుకుని వైద్యం చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అర్హత లేని వారు ఇష్టం వచ్చినట్లు వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడితే సహించేది లేదన్నారు.

ఏడాది బాబును వదిలేసి వెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులు



భూత్పూర్: పట్టణంలోని చౌరస్తాలో ఓ కిరాణ దుకాణం ఎదుట గుర్తుతెలియని వ్యక్తులు ఏడాది చిన్నారి బాబును వదిలేసి వెళ్లారు. శుక్రవారం తెల్లవారుజామున మున్సిపల్ సిబ్బంది వీధులు శుభ్రం చేస్తుండగా చౌరస్తాలో కిరాణం దుకాణం ఎదుట ఉన్న రేకుల షెడ్డులో గుర్తుతెలియని బాబు ఒక్కడే నిద్రిస్తున్న విషయాన్ని గమనించారు. చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో మున్సిపల్ సిబ్బంది స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో హెడ్‌కానిస్టేబుల్ మోగులేర్రెడ్డి అక్కడికి వచ్చి మహబూబ్‌నగర్‌లోని చైల్డ్ వెల్ఫేర్ కౌన్సిలర్ యాదగిరికి సమాచారం అందించారు. అనంతరం యాదగిరి బాబును మెట్టుగడ్డలోని శిశు గృహానికి తీసుకెళ్లినట్లు వివరించారు.

రాక్షస రాజ్యంలో 'గుడ్ల'గూబలు!


కలెక్టర్, ఎస్పీల ముందు నిరసన తెలుపుతున్న విద్యార్థినులు

విద్యార్థినుల వాష్‌రూమ్‌ల్లో సీక్రెట్ కెమెరాలు.. 300 వీడియోలు రికార్డు

"న్యూడ్ వీడియోలు ఇతర కాలేజీల విద్యార్థుల ఫోన్లలో ప్రత్యక్షమైనట్లు మాకు ఫోన్లు చేసి చెబుతున్నారు..!! డబ్బులు తీసుకొని వీడియోలు షేర్ చేస్తున్నారు."

"ఆందోళన, కేసులు అంటే మీ భవిషత్తు దెబ్బతింటుంది.. మీరు, మీ తల్లిదండ్రులు కోర్టుల చుట్టూ తిరగాల్సి ఉంటుంది.. సర్టిఫికెట్లు ఇవ్వరు అని బెదిరిస్తున్నారు. సీఎం చంద్రబాబు తక్షణమే వచ్చి దీనికి సమాధానం చెప్పాలి"

- గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థినుల ఆక్రోశం

సాక్షి ప్రతినిధి, విజయవాడ: వేలాది మంది విద్యార్థినులు చదువుతున్న కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల వాష్ రూమ్‌లలో రహస్య కెమెరాలు అమర్చిన తీవ్ర కలకలం రేపగా.. అధికార యంత్రాంగం ద్వారా దీన్ని కప్పిపుచ్చేందుకు సర్కారు విఫలయత్నం చేసింది. కాలేజీ నిర్వాహకులు టీడీపీ ప్రముఖులకు సన్నిహితులు కావడంతో దీన్ని పక్కదారి పట్టించేందుకు శతవిధాలా ప్రయత్నించింది. వాష్ రూమ్‌లో రహస్య కెమెరాలు అమర్చి వీడియోలను చిత్రీకరించారంటూ విద్యార్థినులు గురువారం రాత్రి నుంచి నిద్రాహారాలు లేకుండా తల్లడిల్లుతుండగా.. అర్ధరాత్రి హాస్టల్‌లో విద్యుత్తు సరఫరా నిలిపివేసి పోలీసులు గుట్టుగా తనిఖీలు నిర్వహించడం.. స్నానాల గదిలో షవర్లు ఊడదీసి తరలించడం ఈ అనుమానాలకు బలం చేకూర్చుతోంది. సీక్రెట్ కెమెరాలపై ఓ విద్యార్థిని వారం క్రితమే ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం... ఎదురు కేసులు పెడతామని బెదిరించడం.. సాహసించి మీరు ఫిర్యాదు చేసినా ఉదయానికల్లా ఆ వార్త ఫేక్ న్యూస్ అవుతుందని విద్యార్థులను వార్డెన్ హెచ్చరించడం.. మర్నాడు ఉదయం అధికారులు కూడా అది ఫేక్ న్యూస్ అని తొలుత బుకాయించడం గమనార్హం. ఇంత దారుణంజరిగితే సమస్యను చిన్నదిగా చూపేందుకు ప్రభుత్వ పెద్దలు యత్నించడం నివ్వెరపరుస్తోంది. దాదాపు 1,500 మంది విద్యార్థినులు ఉంటున్న చోట జరిగిన ఈ దారుణం వెనుక అధికార పార్టీకి చెందిన ముఖ్యులు ఉన్నట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది.

వందల వీడియోలు...

రహస్య కెమెరాలతో ఇప్పటివరకు 300 మంది విద్యార్థినుల వీడియోలు చిత్రీకరించినట్లు తెలియడంతో గురువారం రాత్రి నుంచి శుక్రవారం సాయంత్రం వరకు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. నిద్రాహారాలు లేకుండా వర్షంలోనూ హాస్టల్ వద్ద బైఠాయించి న్యాయం కావాలంటూ నినదించారు. తరగతులను బహిష్కరించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు బాయ్స్ హాస్టల్ వద్దకు చేరుకుని ఆరోపణలు ఎదుర్కొంటున్న విద్యార్థిని అదుపులోకి తీసుకుని ఫోన్, ల్యాప్‌టాప్, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఒంగోలు విద్యార్థిని తండ్రికి టీడీపీ అండదండలు ఉండటంతో యాజమాన్యం వారితో కుమ్మక్కై విచారించకుండా హాస్టల్‌లో ఉంచి సకల సౌకర్యాలు కల్పిస్తోందని ఇతర విద్యార్థినులు ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయం చేయాలంటూ ఆందోళన చేస్తున్న తమను సర్టిఫికెట్లు ఇవ్వబోమని, మార్కులు వేయమని బెదిరిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు.

కళాశాల వద్ద ఉద్రిక్తత..

గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల వద్ద విద్యార్థులు సైతం విద్యార్థినులతో కలసి ఆందోళనకు దిగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. న్యాయం చేయాలంటూ రోడ్డు మీద బైఠాయించారు. విద్యార్థి సంఘాలు, స్వచ్ఛంద సంఘాలు వారి ఆందోళనకు మద్దతు పలకడంతో కళాశాల వద్ద యుద్ధ వాతావరణం నెలకొంది. విద్యార్థులతో కళాశాల యాజమాన్యం, పోలీసులు చర్చలు జరిపగా నిందితులను కఠినంగా శిక్షిస్తేనే ఆందోళన విరమిస్తామని తేల్చి చెప్పారు. మంత్రి కొల్లు రవీంద్ర, కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ, ఎస్పీ ఆర్.గంగాధరరావు, ఎమ్మెల్యేలు వర్ల కుమార్‌రాజా, యార్లగడ్డ వెంకట్రావ్, కాగిత కృష్ణప్రసాద్ కళాశాల వద్దకు చేరుకుని విద్యార్థినులతో పలు దఫాలు చర్చలు జరిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన కళాశాల యాజమాన్యం, వార్డెన్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇవ్వగా యాజమాన్యంపై తమకు నమ్మకం లేదని, రెండు రోజులుగా విషయం తెలిసినా కాలయాపన చేసిందని విద్యార్థినులు పేర్కొన్నారు. గురువారం రాత్రి నుంచి భోజనం, ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం చేయకుండా, వర్షాన్ని సైతం లెక్క చేయకుండా వారంతా మెయిన్ గేట్ వద్ద బైఠాయించారు. కెమెరాలు అమర్చినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ విద్యార్థిని తండ్రి పలుకుబడి ఉన్న టీడీపీ నేతగా చెబుతున్నారు. అధికార పార్టీ నేత కావడంతో ఈ దారుణాన్ని కప్పిపుచ్చేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారని మండిపడుతున్నారు.

ప్రజా సంఘాల మద్దతు..

ఆందోళన చేస్తున్న విద్యార్థినులకు ఏబీవీపీ నాయకులు మద్దతు పలికారు. ఏబీవీపీ జిల్లా జాయింట్ సెక్రటరీ మాగంటి వెంకట గోపి, బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు సీహెచ్ లీలాకుమారి, యువమోర్చా మహిళా జిల్లా సెక్రటరీ వి.అభినందన, నాయకులు కె.వరుణ్, గోపీలు విద్యార్థినులకు మద్దతుగా ఆందోళనలో పాల్గొన్నారు. కోల్‌కతాలో రెసిడెంట్ వైద్యురాలిపై హత్యాచార ఘటనను మరువక ముందే వేల మంది విద్యార్థినులు ఉంటున్న హాస్టల్‌లో రహస్య కెమెరాల అంశం తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. జాతీయ మహిళా కమిషన్ దృష్టికి తెచ్చి కారకులకు కఠిన శిక్షలు పడేవరకు పోరాడతామన్నారు.

అర్ధరాత్రి కరెంట్ ఆపేసి..

అర్ధరాత్రి హాస్టల్‌లో విద్యుత్తు సరఫరా నిలిపివేసి కనీసం జనరేటర్ ఆన్ చేయకుండా బాత్ రూమ్‌లలో పోలీసులు తనిఖీ చేశారని విద్యార్థినులు పేర్కొంటున్నారు. బాత్ రూమ్‌లో షవర్స్ మాత్రమే ఎందుకు తీసుకెళ్లారని ప్రశ్నిస్తున్నారు. షవర్లలో రహస్య కెమెరాలున్నట్లు పేర్కొంటున్నారు.

వారం క్రితమే తెలిసినా..

వాష్ రూమ్‌ల్లో సీక్రెట్ కెమెరాల వ్యవహారాన్ని ఓ విద్యార్థిని వారం రోజుల క్రితమే కాలేజీ యాజమాన్యం దృష్టికి తెచ్చినా నిర్లిప్తంగా వ్యవహరించింది. 'నిన్న సాయంత్రం 5 గంటలకు మరోసారి ఫిర్యాదు చేస్తే విచారణకు నెల సమయం కావాలన్నారు. ఫేక్ న్యూస్ అంటూ మళ్లీ రాత్రి ప్రచారం చేశారు. యజమాన్యం దృష్టికి తెచ్చిన విద్యార్థినిని, తండ్రిని పిలిపించండంటూ రివర్స్ కేసులు పెడతామని బెదిరించారు. మేమేం తప్పు చేశాం? న్యాయం కోరడమే నేరమా?' అని ఆ విద్యార్థి ప్రశ్నిస్తోంది.

ఆధారాలు నేరుగా నాకు పంపండి: ఏపీ సీఎం చంద్రబాబు

గుడ్లవల్లేరు కళాశాల విద్యార్థినుల వద్ద ఆధారాలుంటే నేరుగా తనకే పంపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. ఎవరూ అధైర్య పడవద్దని, తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. శుక్రవారం ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. రహస్య కెమెరాలపై సమగ్ర విచారణ జరపాలని ఆదేశించినట్లు తెలిపారు. ఇంట్లో ఆడబిడ్డకు కష్టం వస్తే ఎలా స్పందిస్తామో అంతే సీరియస్‌గా స్పందించి నిజాలు నిగ్గుతేల్చాలన్నారు. విద్యార్థుల ఫిర్యాదును యాజమాన్యం నిర్లక్ష్యం చేసిందనే ఆరోపణపైనా విచారణ జరపాలన్నారు. ప్రతి మూడు గంటలకు ఒకసారి ఘటనపై తనకు రిపోర్ట్ చేయాలని అధికారులను ఆదేశించారు.

ఆ కాలేజీ టీడీపీ నేత బంధువుదే

గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీ టీడీపీ నేత, విజయవాడ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే భార్య గద్దె అనురాధకు చెందిన బంధువుది కావడంతో పచ్చ గద్దలు రంగంలోకి దిగాయి. వాష్ రూమ్‌లలో రహస్య కెమెరాలు లేవని అధికారులతో చెప్పించే యత్నం చేశారు. విద్యార్థుల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురవ్వడంతో కథ అడ్డం తిరిగింది. గురువారం రాత్రి నుంచి ఈ ఘటనపై విద్యార్థులు ఆందోళన చేస్తున్నప్పటికీ విషయం బయటకు పొక్కకుండా ఆరోపణలు ఎదుర్కొంటున్న అమ్మాయి తండ్రి కీలక పాత్ర పోషించారు. అమ్మాయి తండ్రికి సైతం టీడీపీ పెద్దలతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. అందువల్ల ఆయన కాలేజీ యజమాన్యంపై ఒత్తిడి తెచ్చి, సీసీ కెమెరాల విషయాన్ని పక్క దారి పట్టించే యత్నం చేశారు. ఓ దశలో తన కూతూరి జోలికి వస్తే కాలేజీ పరువు తీస్తానని హెచ్చరించినట్లు తెలిసింది. దీంతో కాలేజి యజమాన్యం.. విద్యార్థిని తండ్రితో కుమ్మక్కు అయ్యింది. టీడీపీ నేతలు, అధికారులు కాలేజి వద్దకు వచ్చి కేసు తీవ్రతను తగ్గించే యత్నం చేశారు.

వైఎస్ జగన్ కల సాకారం

జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ప్రారంభం

- వర్చువల్ విధానంలో మహారాష్ట్ర నుంచి ప్రధాని మోదీ శ్రీకారం
- 76.89 ఎకరాల్లో రూ.288.8 కోట్లతో నిర్మాణం
- 1,250 బోట్లు నిలుపుకునేలా హార్బర్ అభివృద్ధి
- ఏడాదికి 40 వేల టన్నుల మత్స్య సంపద వెలికితీసే అవకాశం
- రూ.392.58 కోట్లతో నిర్మిస్తున్న పూడిమడక హార్బర్‌కూ శంకుస్థాపన
- రాష్ట్రంలో మత్స్యకారుల కష్టాలను తీర్చడానికి రూ.3,500 కోట్లతో 10 హార్బర్ల నిర్మాణం చేపట్టిన జగన్ సర్కార్
- తొలిదశలో జువ్వలదిన్నె, నిజాంపట్నం, మచిలీపట్నం, ఉప్పాడ హార్బర్ల నిర్మాణం
- ఎన్నికల కోడ్ రావడంతో జువ్వలదిన్నె ప్రారంభం వాయిదా



సాక్షి, అమరావతి/నెల్లూరు (దగ్గమిట్ట): ఏపీలోని 555 మత్స్యకార గ్రామాల్లో 6.8 లక్షల మంది మత్స్యకారులకు ప్రయోజనం చేకూర్చే విధంగా సుమారు రూ.3,500 కోట్లతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టిన పది ఫిషింగ్ హార్బర్లు, ఆరు ఫిష్ హ్యాండ్లింగ్ సెంటర్లలోని మొట్టమొదటిదైన జువ్వలదిన్నె హార్బర్ మత్స్యకారులకు అందుబాటులోకి వచ్చింది. నెల్లూరు జిల్లా బోగోలు మండలం జువ్వలదిన్నె వద్ద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో రూ.288.8 కోట్ల వ్యయంతో 76.89 ఎకరాల్లో అభివృద్ధి చేసిన ఈ హార్బర్‌ను ప్రధాని నరేంద్ర మోదీ మహారాష్ట్ర పాలఘర్ నుంచి శుక్రవారం వర్చువల్‌గా ప్రారంభించారు. దీంతో.. ఇప్పటివరకూ పొట్టకూటి కోసం కూలీలుగా పొరుగు రాష్ట్రాలకు వలస వెళ్లిన వారు ఇప్పుడు ఇక్కడే అధునాతన మెకనైజ్డ్ బోట్లతో చేపలు పట్టుకునే వెసులుబాటు అందుబాటులోకి వచ్చింది. ఈ హార్బర్ ప్రారంభంతోపాటు అనకాపల్లి జిల్లా పూడిమడక వద్ద రూ.392.58 కోట్లతో అభివృద్ధి చేయనున్న ఫిషింగ్ హార్బరుకూ ప్రధాని వర్చువల్‌గానే శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కావలి ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్ నెల్లూరు కలెక్టరేట్ నుంచి.. అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఏపీ మారిటైమ్ బోర్డు అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులూ అనకాపల్లి నుంచి పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌తో వాయిదా..

ఇక రాష్ట్రంలో మొత్తం పది ఫిషింగ్ హార్బర్లలో తొలిదశలో జువ్వలదిన్నె, నిజాంపట్నం, మచిలీపట్నం, ఉప్పాడ హార్బర్ల నిర్మాణాన్ని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టింది. ఇందులో తొలుత జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పూర్తికాగా గత ప్రభుత్వ హయాంలో దీన్ని వర్చువల్‌గా అప్పటి సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా ప్రారంభించడానికి అధికారులు ప్రయత్నించారు. కానీ, ఇటువంటి ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టును నేరుగా మత్స్యకారులతో కలిసి ప్రారంభిస్తానంటూ ఆయన వాయిదా వేశారు. ఆ తర్వాత ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ప్రారంభ కార్యక్రమం వాయిదా పడింది. ఇప్పుడు ప్రధాని 13 రాష్ట్రాలకు చెందిన రూ.1,200 కోట్ల విలువైన 217 మత్స్యకార ప్రాజెక్టులను శుక్రవారం ప్రారంభించగా ఇందులో 'జువ్వలదిన్నె' ఒకటి.

25వేల కుటుంబాలకు లబ్ధి..

ప్రధాని ప్రారంభించిన జువ్వలదిన్నె ప్రాజెక్టు ద్వారా 25,000 మత్స్యకార కుటుంబాలు ప్రయోజనం పొందనున్నాయి. 1,250 మోటరైజ్డ్, మెకనైజ్డ్ బోట్లు నిలుపుకునేలా ఈ హార్బరును అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దారు. ఈ హార్బర్ ద్వారా ఏటా 41,250 టన్నుల మత్స్య సంపద అదనంగా అందుబాటులోకి రానుంది. హార్బర్‌లోనే కోల్డ్‌చైన్, ఐస్‌ప్లాంటు, చిల్‌రూం వంటి మౌలిక వసతులతో పాటు బోట్ రిపేర్ వర్క్‌షాపులు, గేర్‌షెడ్లు, నెట్ మెండింగ్ షెడ్లు వంటి సౌకర్యాలు అందుబాటులోకి తీసుకొచ్చారు. అలాగే, నిర్మాణ పనులు ప్రారంభించిన పూడిమడక హార్బరు ద్వారా 980 బోట్లు నిలుపుకునే వెసులుబాటుతో పాటు 4,870 మంది మత్స్యకార కుటుంబాలు లబ్ధిపొందనున్నాయి. మరోవైపు.. రాష్ట్రంలో తలపెట్టిన పది ఫిషింగ్ హార్బర్లు, ఆరు ఫిష్‌ల్యాండ్ సెంటర్లు పూర్తిగా అందుబాటులోకి వస్తే మొత్తం 6.8 లక్షల మంది మత్స్యకారులు లబ్ధిపొందనున్నారు. వీటి ద్వారా 10,521 మెకనైజ్డ్ బోట్లు నిలుపుకునే సామర్థ్యంతో పాటు 4.5 లక్షల టన్నుల అదనపు మత్స్య సంపద సమకూరనుంది. తద్వారా రాష్ట్ర జీడీపీకి రూ.9,000 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా.

భగవంతుడికి కృతజ్ఞతే నిత్యపూజ : చాగంటి



జడ్చర్ల టౌన్: భగవంతుడికి మనం కృతజ్ఞత తెలియజేయడమే నిత్యపూజ అని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. పట్టణంలోని చంద్రగార్డెన్‌లో శుక్రవారం రాత్రి నిర్వహించిన ప్రవచన కార్యక్రమంలో ఆయన సందేశమిచ్చారు. లోకంలో 84 లక్షల జీవరాశులు ఉన్నట్లు శాస్త్రం చెబుతోందని.. నాలుగు రకాల ప్రాణులుండగా ఒక మనిషికి మాత్రమే నిత్యపూజ అన్వయించబడుతుందన్నారు. పూజించడం అంటే విశేషమైన గౌరవం ఇవ్వటంతో పాటు కృతజ్ఞత భావం కలిగి ఉండటమేన్నారు. చేసిన ఉపకారానికి ప్రత్యుపకారం చేయడం సాధ్యం కానందున నమస్కారం చేసి గౌరవించడమేనని వివరించారు. పూజించడంలో మనసు ప్రధానమైందని.. జన్మనిచ్చినందుకు తల్లిదండ్రులు, జ్ఞానం అందించినందుకు గురువును పూజించవచ్చన్నారు. భగవంతుడు నిర్ణయిస్తే కోటిమంది వైద్యులు వచ్చినా బతకలేరని.. ఆయన బతకాలని నిర్ణయిస్తే మృత్యువును జయించవచ్చని, భగవంతుడి శాసనం మేరకు సమస్తం నడుస్తుందని తెలిపారు. శరీరం ఇచ్చిన భగవంతుడిపై కృతజ్ఞత కలిగి ఉండాలని.. మనిషి ఉపకారగుణం కలిగి ఉండాలని, అది భగవంతుడి నుంచే ప్రారంభం కావాలన్నారు. ఎంత సంపాదించినా చివరకు ఏమీ తీసుకోలేమని.. చనిపోయాక శ్మశానంలోని అస్థికలు నదుల్లో కలుపుతారే తప్పా ఇంటికి తీసుకెళ్లరని వివరించారు. కార్యక్రమంలో భాగంగా హరిహరాదుల పూజలు చేశారు. ప్రవచనానికి ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, ఆహ్వాన సంఘం అధ్యక్షుడు బి.శివకుమార్, డా.రాజేష్, పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యారు.


వేపచెట్టుకు పాలధార

జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలం చాగదోవలో ఓ వేపచెట్టుకు పాలధార(తెల్లటిద్రవం) వస్తుండడం స్థానికులను ఆశ్చర్యం కలిగించింది. గ్రామసమీపంలోని రైతు నగేష్ శుక్రవారం తన పశువుల పాకలో ఉన్న వేప చెట్టుకు పాలధార వస్తుండడాన్ని గమనించాడు. ఈ విషయాన్ని గ్రామస్తులకు తెలపడంతో అక్కడి చేరుకుని పరిశీలించారు. ఇదేదో వింత అని కొందరు ఏకంగా వేపచెట్టుకు పూజలు సైతం చేశారు. బ్రహ్మంగారు కాలజ్ఞానంలో చెప్పినట్లు వింతలు జరుగుతున్నాయని, వేప చెట్టు నుంచి పాలు కారడం కూడా ఇలాంటి వింతే అని చర్చించుకున్నారు. కాగా..



'వేప చెట్టు పెద్దదయ్యాక.. ఎక్కువైన నీటిని కణాల్లో నిల్వ చేసుకోవడం మొదలుపెడుతుంది. బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ కారణంగా చెట్టు కాండంపై తొర్రల్లా వస్తాయి. వాతావరణంలో తేమ శాతం ఎక్కువైనప్పుడు.. వేప కొమ్మల్లోని ఈ తొర్రలు బలహీనపడి పగుళ్లు వస్తాయి. అందులో నుంచి పాల లాంటి ద్రవం వస్తుంది.' అని వృక్షశాస్త్ర నిపుణులు చెబుతున్నారు. - గట్టు (జోగులాంబ గద్వాల జిల్లా)

అలంపూర్ ఆలయంలోకి వర్షపు నీరు



ఇటీవల కురిసిన వర్షానికి అలంపూర్ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయం పైకప్పుపై నిలిచిన వర్షపు నీరు సోమవారం లోనికి చేరింది. ఇటీవలే ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా(ఏఎస్ఐ) రూ.లక్షలు వెచ్చించి ఆలయ పైకప్పు మరమ్మతు చేయించినా ఫలితం లేకపోయింది. పనులు నాసిరకంగా చేపట్టడంతో సమస్య ఉత్పన్నమైందని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్‌శర్మ, బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగమద్దిలేటి ఆరోపించారు. మరమ్మతు సమయంలో క్వాలిటీ కంట్రోల్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నాసిరకం పనులు జరిగాయన్నారు. ప్రధాన ఆలయంలోని వీరభద్రస్వామి మండపం, నవగ్రహ మండపం, బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలోని గర్భాలయ మండపం, ప్రధాన ద్వారం దగ్గర ఎడమ వైపు నీరు చేరుతోందని ఆలయ అర్చకులు ధనుంజయశర్మ, రికార్డ్ అసిస్టెంట్ శ్రీకాంత్ తెలిపారు. - జోగులాంబ శక్తిపీఠం

చట్టసభలపై అవగాహన అవసరం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నాగర్‌కర్నూల్ ఎంపీ డా. మల్లురవి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి తదితరులు

నాగర్‌కర్నూల్ (బిజినేపల్లి): విద్యార్థులు చట్టసభలపై అవగాహన కలిగి ఉండడంతో పాటు.. వాటిలో కూర్చొని ప్రజా సమస్యలపై గళం విప్పే దిశగా అడుగులు వేయాల్సిన అవసరం ఉందని ఎంపీ డా. మల్లురవి అన్నారు. చిన్ననాటి నుంచే రాజకీయాలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. శుక్రవారం మండలంలోని వట్టెం జవహర్ నవోదయ విద్యాలయం ఆధ్వర్యంలో.. వట్టెం శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థాన ప్రాంగణంలో యూత్ పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహించగా.. ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి తదితరులతో పాటు హాజరై ప్రసంగించారు. యూత్ పార్లమెంట్ కార్యక్రమంలో తమను తాము చూసుకున్నామని, విద్యార్థులు చక్కటి ప్రదర్శన కల్పించారన్నారు. ఇలాంటి ప్రదర్శనలు అన్ని పాఠశాలల్లో, కళాశాలల్లో నిర్వహించాలని సూచించారు. అప్పుడే భవిష్యత్ రాజకీయాలపై యువత పట్టు సాధించవచ్చని పేర్కొన్నారు. ఇలాంటి ప్రదర్శనల వల్ల యువతలో నమ్మకం, ప్రశ్నించేతత్వం, సమస్యల సాధనకు ఎలా కృషి చేయాలో తెలుసుకుంటారన్నారు. అంతకుముందు జ్యోతి ప్రజ్వలనతో చేసి కార్యక్రమం ప్రారంభించారు. ప్రిన్సిపాల్ భాస్కర్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దాచుకుందామంటే.. దోచుకున్నారు

- 21 మంది బ్యాంక్ ఖాతాల నుంచి రూ.95 లక్షలు మాయం


బ్యాంకు మేనేజర్‌తో మాట్లాడుతున్న ఖాతాదారులు

అచ్చంపేట రూరల్: కష్టపడి సంపాదించిన డబ్బులను ఇళ్లలో దాచుకుందామంటే దొంగల భయం.. డబ్బులను బ్యాంకులో దాచుకుందామంటే బ్యాంకు అధికారులే దొంగలుగా మారుతున్నారు. ఇలాంటి సంఘటనే నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలోని ఓ జాతీయ బ్యాంక్‌లో చోటు చేసుకుంది. వివరాలిలా.. అచ్చంపేట ఎస్‌బీఐలో కొన్నేళ్లుగా రైతులు, పేదలు, వ్యాపారులు, ఇతరులు డబ్బు దాచుకుంటున్నారు. కాగా అమాయక రైతులు, పేదల ఖాతాల్లోని డబ్బులు ఖాళీ అవుతున్నాయి. అయితే గతేడాది సెప్టెంబర్, అక్టోబర్ నెలలో కొంతమంది ఖాతాదారులు బ్యాంకుకు వచ్చి డబ్బులు తీసుకోవడానికి ప్రయత్నించగా.. ఖాతాల్లో డబ్బులు లేవని చెప్పడంతో ఆందోళన చేశారు. గ్రహించిన బ్యాంకులోని క్లర్క్ కిరణ్ (సూత్రధారి) క్షణాల్లో ఇతర ఖాతాల నుంచి ఆందోళన చేసిన ఖాతాదారులకు డబ్బులు మళ్లించాడు. ఈ తతంగాన్ని గ్రహించిన ప్రస్తుత బ్యాంకు మేనేజర్ హుస్సేన్‌బాషా పూర్తిస్థాయిలో విచారణ చేయగా విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. 2018 నుంచి క్లర్క్ కిరణ్ ఒకరి బ్యాంకు ఖాతాల్లోని డబ్బులు మరొకరి ఖాతాల్లోకి మళ్లించి.. 21 మంది ఖాతాదారుల నుంచి రూ.95 లక్షలు మాయం చేసినట్లు బ్యాంకు అధికారులు నిర్ధారించారు. చాలా ఏళ్ల నుంచి బ్యాంకులో పాతుకుపోయిన క్లర్క్ కిరణ్ ఖాతాల్లోని డబ్బులు ఖాళీ చేసినట్లు నిర్ధారణ కావడంతో అతన్ని విధుల నుంచి తొలగించడంతో పాటు సస్పెండ్ చేసి జైలుకు పంపినట్లు తెలిసింది. అయితే రైతులు, పేదలకు బ్యాంకు నుంచి గానీ, సస్పెండైన వ్యక్తి నుంచి గానీ డబ్బులు రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

బ్యాంకు మేనేజర్‌తో వాగ్వాదం..

బ్యాంకు అధికారుల చేతిలో తాము మోసపోయామని, దాచుకున్న డబ్బులు దోచుకుని ఇవ్వడం లేదని ఆరోపిస్తూ శుక్రవారం అచ్చంపేట ఎస్‌బీఐలో మేనేజర్‌తో ఖాతాదారులు వాగ్వాదానికి దిగారు. టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ అడ్వైజరీ కమిటీ మెంబర్ బొజ్జ అమరేందర్‌రెడ్డి, కొందరు నాయకులు ఖాతాదారులకు మద్దతుగా నిలిచారు. అవసరాల కోసమని బ్యాంకులో డబ్బులు దాచుకుంటే అమాయక ప్రజలకు తెలియకుండా దోచుకున్నారని, ఏడాది గడుస్తున్నా ఖాతాదారులకు డబ్బులు ఇవ్వకపోవడం బ్యాంకు అధికారుల నిర్లక్ష్యమేనన్నారు. 15 రోజుల వ్యవధిలో డబ్బులు ఇవ్వకపోతే బ్యాంకు ఎదుట పెద్దఎత్తున ఆందోళన చేస్తామని, ఈ విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి, బ్యాంకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. దీంతో స్పందించిన మేనేజర్ అతి త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని, 20 రోజుల్లోగా ఖాతాదారులకు డబ్బులు చెల్లిస్తామని చెప్పారు.

మాజీ మంత్రి హయాంలోనే భూకబ్జాలు, ఆక్రమణలు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

స్టేషన్ మహబూబ్‌నగర్: పదేళ్లలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హయంలోనే నియోజకవర్గంలో ప్రభుత్వ భూములు కబ్జాలు, ఆక్రమణలకు గురయ్యాయని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.వినోద్‌కుమార్ అన్నారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో గొప్ప ప్రక్షాళనకు శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. అధికారులు పూర్తిగా విచారించి ప్రభుత్వ భూములను కాపాడడానికి క్రిస్టియన్‌పల్లి శివారులో ఉన్న 523 సర్వేలో ఉన్న అక్రమ కట్టడాలను కూల్చివేయడం జరిగిందన్నారు. మాజీ మంత్రి అక్కడికి వచ్చి నిరుపేదలకు నీడ లేకుండా చేశారని తప్పుడు మాటలు మాట్లాడుతుండడం సిగ్గుచేటని ఆరోపించారు. అప్పట్లో అధికారాన్ని అడ్డంపెట్టుకొని మీ తమ్ముడు, అనుచరులు కబ్జాలు చేపించింది, దొంగ పట్టాలు ఇచ్చింది నిజం కాదా అని ప్రశ్నించారు. కేవలం రాజకీయ లబ్ధి కోసం మాజీ మంత్రి ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారని ఆరోపించారు. నిజమైన లబ్ధిదారులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. నిజమైన లబ్ధిదారులు ఉంటే తహశీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు ఇవ్వాలని, ప్రభుత్వం న్యాయం చేస్తుందని అన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుపేదల సంక్షేమానికి ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు సిరాజ్‌ఖాద్రీ, లక్ష్మణ్‌యాదవ్, మల్లు నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా రాములోరి కల్యాణం



ఎర్రవల్లి: శ్రీరాముడి జన్మనక్షత్రం పునర్వసును పురస్కరించుకొని బీచుపల్లి కోదండరామస్వామి ఆలయంలో శుక్రవారం సీతారాముల కల్యాణ వేడుకను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు భువనచంద్ర, దత్తుస్వామి సీతారాముల ఉత్సవ విగ్రహాలను ముస్తాబుచేసి కల్యాణం జరిపించారు. పరిసర ప్రాంతాల భక్తులు తరలి వచ్చి పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి కల్యాణ క్రతువును తిలకించారు. భక్తులకు షేకుపల్లికి చెందిన శ్రీకాంత్‌రెడ్డి అన్నదానం నిర్వహించినట్లు ఆలయ మేనేజర్ సురేందర్‌రాజు పేర్కొన్నారు. పాలక మండలి సభ్యులు, అర్చకులు, భక్తులు ఉన్నారు.